# దోదమ్మి

శ్రీ మల్లాది
రామకృష్ణశాస్త్రి

పున్నమి మళ్లిన,— మూడునొన్నక్క—
పొద్దున,-తొలిజామున తళుకేసిన కెంపు
చుక్క,—రిమరిమ,సున్నలో కెక్కి శూన్యం
లోకి ప్రాకి,-కానరానంత మేరకమ్ముకునివున్న
మొయిలుతుంపరలో,ఒకమినుకు వల్లమాలిన
వెలుగై పోవంగా,-రవరవమంచులు చిమ్మి —
ఉహుహూలు ధారలుకట్టి,-ఏడుపాయలై ఏక
రాశిని,-పాలవెల్లిమీద తొణికిపోగా,-పరుచు
కున్న ముత్తెపుచుక్కలు,ఓవాసి కదిలి,-వెలు
గని వేడికి తీగెసాగి,-చుక్కలదారిలో సుడి
తిరిగి,-నీడలున్న మేరల్లో, చిగురేసి,—తళుకు
వాగులో,—మారాకు వేసి,-బెళుకువాగులో,-
మొగ్గతొడిగి,—ఏకమొయిని జారి, ఒంటిరేక
విచ్చి,—గాలి తెరకంది,—మరింతవిచ్చుకుని,—
మరో అలమీద,-పక్వానికొచ్చి, - పాకాని
కొచ్చి,-నివ్వరిముల్లంత వెన్నేసి,-అంతవెన్న
లోనూ ఓ రెమ్మ, పైరలో మరగిపోకుండా,-
నేలమీద,-కానరాక వాలంగా,—

కోనలో నాయకుడికి, - కంటిమీద
మెరుపు మెరసి, ఒంటికి సత్తువొచ్చి,- ఒక్క
గుక్క, కుశేలొచ్చి,—గురువింద పొదమీద
పులుగు పోరెట్టగా,- పుట్టినబిడ్డ పోరెట్టగా,-
ఆచేత అందుకుని,-అమ్మువిడిచినట్లు,-ఎగరేసి,-
ఓచేతఅందుకుని,- ఔరకూనా,- సత్తువుంది,
సంబరముంది, — గొంతులో బిగువుంది,—
చూపులో పదునుంది: కోన ఏలుకు నేవులే—
అని,-ఓ కన్ను చేతి కెగురవేసి,- కోనదేవరా,
వాకిలి పండంతపుట్టి,-తీయమామిడంత తేరు
కోవాలి : పగవాడి కంటికి పనసముల్లు,
కావాలి,- బైరుకున్న వడిచ్చి,- సింగం కోర
కున్న వాడిచ్చి,-నాగంత పగుగిచ్చి,—అలు
గంత పదునిచ్చి,-ఆదుకోరా! ... అని, మాట
వేసారించి,- ఒంటిరక్కెస గుబురు మొదల,-
ఓచెయి విదిలించి,- మంచుకు మల్లె, కెంపు
చుక్కలుబుకంగా,-చుక్క నేలరాలకముందే,-
కూనకు నుదురద్ది ... ఇది,-నీ వెన్ను కాపురా
కూనా,—అని, అని,— మొయిలు దేవుడా,—నీవు
చినికితే, ముత్తెం దొరికింది ... నీ సత్తెం
జూపరా,-అని కొండాడి ... కనులుమూసి,—
మూడు అంగలేసి,-ఒకకన్ను తెరిచి, మూడు
పరుగులుతీసి, — రెండుచూపులుకలిపి,-మూడు
ఉరుకు లురకంగా,—ధగధగమనే గరపవెంపలి
మీద,-పచ్చని, కాడ,-రంగుకోచిగురు-చిటా
రున కెంపంత పువ్వు,—అల్లంత చిటిమాను
కానరాగా ... యిదే సత్తెమని,- తోడుగా
పెరిగేవని,—చికిలి చికిలింత మండలు తెచ్చి,
మాను తేనె పాదుకట్టి,— కడిమిపూల నీరోసి
గోగుపుప్పొడి చల్లి,— మూడు పొద్దులకు
గుబురుకట్టించి,—గుబురిచ్చిన నీడలో కూనను
సాకమనంగా,—

పెల్ల మొయిలు వెలుగేయంగా,- కొండ
గోగు పూసినట్టు,-కొణిదెన చిగురేసినట్టు,-

ఇరులునిటారోయినట్లు..పున్నమిపున్నమికీ,-ఒక్క-పిడికిలి,-ఒక్క- అల్లైతాడు,-రెండు అలుగులు,-ఒక్క-బరిసె, ఒక్క- సెలగోల...అంత ఉవ్వెత్తుకువచ్చి,— కూనఎదిగి,— కోనకు సిరొచ్చి,-ఏడునిలువులు ఎదిగి,-చిటారుపూవుతోవున్న పచ్చమాను,—వయసొచ్చినట్టు,—ఎవరినో కోయని పిలిచినట్లు,— ఊగులుపోవంగా,—

ఆ ఊగున,-కోనవాగుకు వెల్లువొచ్చి... వెల్లువ రెచ్చి వరదొచ్చి,-కాలూన తావులేక ఏకమయం కాగా,- జీవాలన్నీ,-మరో కోనకు ఈదులాడుకుపోగా,-కోనసిరి,-తాపుట్టిపెరిగిన కోనకు వెన్నిచ్చుకోలేక,-మానికి ఎగ్రబాకి,-చిటారుకుపోయి,- కెంపుకొడిపూవును,- గోటితోగిరి,—మాను ఏకం-దీసి,-పదిలంగా చుట్టి,-అమ్ముకు లగించి,—ఆకాశంలోకి అంతరిక్షంలోకి విడువంగా...అలా దూసుకున్న పూవు, దారినిపట్టి..గాలిపొరమీద తేలుకుపోయి,—పుప్పొడి రగులంగా,-బరువెక్క-, భార మెక్క-,-తామరల మడుగులో,—మారాజుసీమలో,-సీమ ఏలేవాడి, గారాబాలకూన,- జలకాలాడంగా,—సరసను రాలె:

పూవుసోకిన మేర,-బుగబుగలాడి,-బుగబుగలాడిన మేర, ముదురుపచ్చదేరి,-వేయినొక్క-చుక్క-, ఒక్క-మొయిని మిడిసినట్లు,- చందమామ దూగర రేగినట్లు,-పాలవెల్లి నేలకూలినట్లు, వెలుగులు చిటపటలాడి,-రంగులు సుడికట్టి,- మడుగునీరు వడిపట్టి,- హంస కదిలినట్టాడంగా,—

రాలినపూవు, రంగు ముదిరి, రేకముదిరి,-పుప్పొడి పూసకట్టి,-పూస బుడగంతకెదిగి,-గాలిసోకిళ్ల,చిటుకు చిటుకుమనంగా,-పుప్పొడిమంచు కమ్ముకోంగా,-రాచకూనకు,-మాయదారి మరులొచ్చె...మనసుకు రెక్క-లొచ్చి నట్టనిపించె,-వినని ఎలుగు వినిపించె,-చూడని చోద్యాలు కనిపించె...

ఇదేమా అనుకున్నది,-రాచకూన,—నిలువలేకపోయె, నిదురగాకపోయె,- వెనుదిరిగి చూడంగ చీకటే అయిపోయె,—తానెవ్వరైనదీ తెలియకనెపోయె... కనుమలపి చూడంగ మునుముందు వెలుగాయె-తనకు అంది నట్లనిపించె - తానందినట్లగుపించె,-

అలా నిలువలేకపోయిన రాచకూన,-తనకు తెలియక, పలుకులేక,- పట్టు తప్పిన తీవెలాగా,- తీండ్రం మానిన సింగం జూలులాగా,- తమ్మిని విడిచిన తుమ్మెద ఝుమలాగా,- చంద్రుడు సోకిన చెంగల్వలాగ,-సొమ్మసిల్లి సోలిపోయి,- అదేమా అని ఆదుకునేవారు ఎవరూలేని ఏకాంతమాయెనేమో,- మడుగున మల్లెలు కమ్మినట్టు పైన జాజులు పమ్యెద సవరించినట్లు,- మందారలు వల్లెవాటు వేసినట్లు,- పూపచిగురులు మేలిముసుగు నిమిరినట్లు,- కానరాని చేతులు,-తనకేమో ఆభరణా లిచ్చినట్లు, - అంగరాగ మలదినట్లు,- చిలిపిసేతలు చేసినట్లు,-లీలగా అనిపించంగా,- బిడియం వసివాడించంగా,- తమకాలూ తబ్బిబ్బులుగా,-

దొంతరవిడియ మందుకున్న మంకెన వాతెరతో,- కాముని చూడబోయే కన్నులతో మోమున నిండిన పున్నెముతో,- విన్నాణపు వేడుకతో,- వింత వేదనతో,- ఆణిముత్తెమంత మురిపెముతో,- చేర్చుక్కంత చెలువంతో,- నివ్వెరిమొనవాసి కలలో,- నిదురంత కాపురంచేసి,- మెలకువంత మగతా మమతా కుదురకోంగా,- రాలిన పువ్వునందుకుని,- దాని నిగ్గులు నిమిరి,- కొనగోర కాటుక దీసి,- ఒక రేకను చికిలించి,- మరో రేక,- కెమ్మోవి కద్ది,- అన్ని రేక లలా నెమ్మోమున హత్తించి,- రాలిన పూవును, రాజసంగా,- పయ్యెద కొత్తులిచ్చి,- చేపట్టిన వాని చెక్కిలి పుణికినట్లు,- వింతమనసు పోయి,- ఏమని పలికేనో-

గాలి పొరమీద తేలివచ్చి,- కానరాని వలపుతెచ్చి,—అలసిపోని ఆనందమిచ్చి,- కాంతుడు లేని కాపుర మిచ్చి,- మిన్నంత కలలో కన్నతల్లిని చేసి,- బాలను ప్రోడను చేసినావు, యిది,- ఏ సీమ పట్టిన వానిపంతమే!- తానందుక నన్నందుకుంటి ననుకున్నాడ,- నేలను నడిచేవాడు, నన్ను తేరిచూడరాదు., కొండకొమ్మున ఉన్న వాడైతే,- నన్ను కోరుకోరాదు,- మానెక్కిన వాడైతే,- తనకు మనసైనా,- మక్కువ తీయలేనని పలుకవే... గాలిని పడిపోం-

రాలినపూవు,- వెల్లగొడుగై విచ్చుకోగా,- విచ్చుకున్న పూవు,- గువ్వలాగ పైన తేలగా,- తనకు తెలియక తానూ కదిలి,- నీడను అడుగులు వేసి,- ఎదురయే చోద్యాలకు ఎడమోమై,- కంటి కందిన,- వింతలకు పెడమోమై,- సూటిచూపున,- శూన్యంలో వెన్నెల కమ్మినంత మనసున,- అలాఅలా,- వాగులు దాటెనో ఏరులు దాటెనో,- గుట్టలు దాటెనో గుబ్బలి దాటెనో,- లెక్కలేకపోయి,-

అలా,-అడుగు కదిలి పోతూండగా,—

తామర మడుగులో, రాచకూన తల పోసినప్పుడు, మానినున్న కోనసిరికి,— కొమరుతనం హెచ్చి,- కన్నె కలలో,- కాంతుడైనప్పుడు,- మానుకూలి నేల పాదం పెట్టి,-తానో తామర మడుగై,- కానరాని, తల్లితనానికి,-నూటొక్క హంస,- కూనలై, కనులబడగా,- సొమ్మసిల్లే ఆనందమొచ్చి,- హంసరెక్కలు అలసటలు తీర్చగా,- ముసి ముసి నవ్వు ముసలితనానికి, ముదిరే వేళ,-

తానెక్కిన మాని తావున,- కలయ దిరిగిన కన్నెలేడి,- కూనను విడిచిపోగా,- లేడికూనకు పుప్పొడి అద్ది,- తామర రేకులు తేనె దొన్నెలు చేసి,- వావిలి పూవులు మెదిపి,- ఆ ఉక్కెర మెక్కించి పెంపకం చేయగా,- కూనకు గుజ్జు సింగమంత, వెన్నొచ్చి, వేటొచ్చి, హంసలతో అన్నదమ్ముల పోలికను,- కోనసిరి కనుల నీడను గువ్వంత లాడుతూ ఉండగా,—

వెల్లగొడుగు నీడ కదలి వచ్చిన రాచకూన,- తాను ఆ తావుకు చేరుకోగా,-

చూడని తల్లిని చూసిన సంబరాన,- హంసలు కమ్ముకోగా,- ఒక్క హంస గుసగుసపోయి, కోనసిరితో గుసగుస లాడంగా,- తక్కిన హంసలు, బారుతీరి, బరాబరుల నడకలు నడిచి,- కోనసిరిని తల్లి కనులముందుకు తరలించుకురాగా,- లేడికూన సింగం సీటున విద్దెలు చూపించగా,- చోద్యాన ఉన్న రాచకూన,- కోనసిరిని చూసిందై,- కనులు అరమోడ్చిందై,-తల వంచుకున్న దాయెను,-

ఒక్క ఎగురున అందిన లేడికూనను, సందిట పట్టిన కోనసిరి మనసు ఎన్నడూ లేని మరులోయింది,-

రాచకూన, ఆకసాన, వెలుగు పొంగినట్లు పొంగిపోయి,- వేయినొక్క చుక్క తళుకాడినట్లు, కదలిపోయె,- అంతలో ముత్తె మంత మోము చేసుకొని,- కనులతో ఏమన్నదనగాను,-

కన్నతనాన కలవచ్చింది,- మెలకువ లేకనే ఫలించింది,- వెలుగు రాపాడగా పుటక ఎత్తినవాడు,- నన్నేలుకున్నాడు: నేలకు రాలినవాడు,- నా వయసు నిదర పాల్జేసినాడు... నీవు తెలియక చేసినతప్పు,- నిదురలో నాకు మెప్పయింది ... కాన రాకుండ కాపురం చేశాము,- కలలు హంసలై పుట్టినవి: నాబిడ్డలు, నాకుచాలు; కోనంత కోరికుండి,- లేడికూన నెత్తి పెంచి సింగాన్ని చేసినావు,- దానితో ఆట- ఆపైన నీ బతుకు,- అని,- తనదారిని తాను పోగా,- హంసలు అనుసరించిపోయె...

నాలుగు గిరులు కట్టి,- మడుగు చేసిన కోనలో కోనంత తామరల మడుగులో- ఆ హంసల పెంపకమాయె...

గిరుల కొమ్ములమీద చెంగలించే కూన పరుగందుకోలేక- కోనసిరి,- తాను పెరిగిన చికిలింత నీడనే తానో నీడగా నిలిచిపోయె...